క్లుప్తంగా

సోమయ్య మృతి బాధాకరం



సోమయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు

హుజూర్‌నగర్ : పట్టణంలోని గోవిందాపురంలో ఇటీవల మరణించిన మాల మహానాడు నాయకుడు రెంటాల సోమయ్య కుటుంబాన్ని శనివారం మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోమయ్య మృతి బాధాకరమని అన్నారు. ఆయన వెంట హైకోర్టు పీపీ పల్లె నాగేశ్వరరావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ చంద్రశేఖర్, డాక్టర్ కె.గోవింద్, నాయకులు బాబురావు, బెంజిమెన్, శ్రీను, రాంబాబు, వినోద్, విమన్ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో 'జయ' విద్యార్థుల ప్రతిభ



ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

కోదాడ : హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన చుక్కా లక్ష్మీబాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో కోదాడలోని జయ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చిలువేరు వేణు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టాలెంట్ టెస్ట్‌లో పాఠశాలకు చెందిన ఐదవ తరగతి విద్యార్థి పి.కీర్తి స్టేట్ ఫస్ట్ ర్యాంక్, 6వ తరగతి విద్యార్థి ఎస్‌కె.జాహిద్ 6వ ర్యాంక్, 9వ తరగతి విద్యార్థి పి.వికాస్ 4వ ర్యాంక్, 10వ తరగతి విద్యార్థి సీహెచ్.అక్షయ్ 6వ ర్యాంక్ సాధించినట్లు ఆయన తెలిపారు. వంద లోపు ర్యాంకుల్లో తమ పాఠశాల విద్యార్థులే 45 ర్యాంకులను సాధించారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులను పాఠశాల నిర్వాహకులు జయ వేణుగోపాల్, పద్మ, జ్యోతి, ఉపాధ్యాయులు అభినందించారు.

వానరానికి అంత్యక్రియలు



వానరం మృతదేహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న యువకులు, చిన్నారులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని వేపల సింగారం ఆవాస గ్రామం మిట్టగూడెంలో శనివారం వానరం మృతి చెందింది. గ్రామానికి చెందిన యువకులు, చిన్నారులు వానరాన్ని ట్రాక్టర్‌పై ఊరేగింపుగా తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో కదిర వెంకటరెడ్డి, సైదిరెడ్డి, మౌలాలి, శ్రీకాంత్, శంకర్, సైదులు, వెంకటేశ్వర్లు, నర్సింహారెడ్డి, చిన్నారులు గోపి, సాయి, వంశీ, శ్రీను, సాయి పాల్గొన్నారు.

డ్రమ్‌సీడర్, వెదజల్లే పద్ధతులతో అధిక దిగుబడులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న గడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్త నరేష్

మునగాల : డ్రమ్ సీడర్, విత్తనాలు వెదజల్లే పద్ధతుల్లో వరిసాగు చేపట్టి అధిక దిగుబడులు సాధించవచ్చని గడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్త నరేష్ తెలిపారు. శనివారం మునగాల మండలంలోని మాధవరంలో భారతీయ వరి పరిశోధన సంస్థ (ఐసీఏఆర్) రాజేంద్రనగర్ ఆధ్వర్యంలో ఎస్‌బీఐ సీఎస్ఆర్ ఫండ్ సహకారంతో నేరుగా విత్తనాలు విత్తే పద్ధతిలో వరి సాగు చేపట్టడంపై రైతులకు శిక్షణ ఇచ్చారు. డ్రమ్ సీడర్, విత్తనాలు వెదజల్లే పద్ధతులు, డ్రోన్ ద్వారా కలుపు మందు పిచికారీ విధానంపై అవగాహన కల్పించారు. చీడపీడల సమస్య, నీటి యాజమాన్య పద్ధతులు, కలుపు నివారణ, తదితర అంశాల గురించి వివరించారు. నేరుగా వరి విత్తే పద్ధతి ద్వారా సాగు చేస్తే కూలీల సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త ఏ.కిరణ్, మండల వ్యవసాయాధికారి బి.రాజు, యంగ్ ప్రొఫెషనల్ జి.సంతోష్, రైతులు అరవింద్, సురేందర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, సత్యనారాయణ, దిలీప్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫ్లెక్సీ తొలగింపు

హుజూర్‌నగర్ రూరల్ : మండలంలోని వేపల సింగారంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవంలో భాగంగా శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హుజూర్‌నగర్ –మేళ్లచెరువు ప్రధాన రహదారిపై రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి ఫొటోలతో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో స్థానికంగా ఉన్న మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు విగ్రహానికి మాస్క్ కట్టారు. ఆ విగ్రహం పక్కనే కాంగ్రెస్ నాయకులు ఫ్లెక్సీ ఏర్పాటు చేయడం చర్చనీయాంశంగా మారి సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీంతో గ్రామ పంచాయతీ సిబ్బంది, సంబంధిత అధికారులు ఫ్లెక్సీని తొలగించారు.

పారిశుద్ధ్యంపై పట్టింపేదీ!



అప్పన్నగూడెంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద నిలిచిన మురుగు నీరు



సిరికొండలో నిలిచిన మురుగు

- డ్రెయినేజీల్లో నిలిచిన మురుగు
- దుర్వాసన, దోమల వ్యాప్తితో ఇబ్బందులు
- గ్రామాల వైపు చూడని ప్రత్యేక అధికారులు

మోతె : మండలంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. మురుగు కాల్వలు పూడి దుర్వాసన వెదజల్లుతున్నాయి. వీధుల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది. పాలకవర్గాలు లేకపోవడంతో పరిశుభ్రతలో లోటు కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది. గ్రామాల్లో దోమల నివారణకు కనీసం నెలకు రెండు సార్లైనా ఫాగింగ్ చేయాలి ఉన్నా ఆదిశగా చర్యలు లేదు. అప్పన్నగూడెంతో పాటు పలు గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేక నీరు వీధుల్లో పారుతోంది. అక్కడక్కడ గుంతల్లో మురుగు నిలిచి దోమలకు, ఈగలకు నిలయాలుగా మారాయి. గ్రామ, మండల స్థాయి ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ లేక గ్రామాల్లో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ స్థాయి అధికారులు విధులకు హాజరై మధ్యాహ్నం వరకే ఇంటి ముఖం పడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాగునీటి క్లోరినేషన్ లేదు. బ్లీచింగ్ పౌడర్ చల్లే నాథుడే కరువయ్యారు. ప్రత్యేక అధికారులు గ్రామాలవైపే చూడడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రత్యేక అధికారులు గ్రామాల్లో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మురుగు కాల్వలు కంపుకొడుతున్నాయి

సిరికొండలోని మసీద్ ప్రాంతంలో మురుగు కాల్వలు శుభ్రం చేయకపోవడంతో కంపు కొడుతున్నాయి. రాత్రి వేళ దోమల బెడదతో నిద్ర రాక ఇబ్బందులు పడుతున్నాం. మురుగు కాల్వలు శుభ్రం చేసి దోమల మందు పిచికారీ చేయాలి.

– షేక్ జానీ, సిరికొండ

వసతులు లేక ఇబ్బందులు

మా గ్రామంలో పరిసరాలు పరిశుభ్రంగా లేక దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. దోమల బెడదతో రాత్రివేళ నిద్రలేక జాగారం చేయాల్సి వస్తోంది. డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి పరిసరాలు శుభ్రం చేయించాలి.

– నంద్ర పెద్ద శ్రీను, అప్పన్నగూడెం

ఎమ్మెల్సీగా సరోత్తమ్‌రెడ్డిని గెలిపించండి

- బీజేపీ జిల్లా అధ్యక్షురాలు శ్రీలతారెడ్డి

నేరేడుచర్ల : ఈనెల 27వ తేదీన జరగనున్న నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థి సరోత్తమ్‌రెడ్డిని గెలిపించాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు శ్రీలతారెడ్డి కోరారు. ఈమేరకు శనివారం నేరేడుచర్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను కలిసి ఓటు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలంటే బీజేపీతోనే సాధ్యం అవుతుందన్నారు. ఎమ్మెల్సీగా సరోత్తమ్‌రెడ్డిని శాసనమండలికి పంపిస్తే తెలంగాణలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై తన గొంతు వినిపిస్తారని తెలిపారు. ఎన్నికల్లో సరోత్తమ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ప్రభారీ రుక్మారావు, అసెంబ్లీ ఎన్నికల కన్వీనర్ బాల వెంకటేశ్వర్లు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొణతం నాగిరెడ్డి, పాలకీడు మండల అధ్యక్షుడు నరినాయక్, తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను ఓటు అడుగుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలతారెడ్డి

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



స్వపరిపాలన వేడుకలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మోతె : మండలంలోని రావికుంటతండాలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కలెక్టర్‌గా భూక్యా కార్తీక్, జిల్లా విద్యాధికారిగా భూక్య చేతన్, మండల విద్యాధికారిగా సాహితి, ప్రధానోపాధ్యాయులుగా కవిత, పలువురు ప్రజాప్రతినిధులుగా బాధ్యతలు నిర్వర్తించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సింహాద్రి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గురుకుల పరీక్షకు ఏర్పాట్లు పూర్తి



చిలుకూరు : ఉపాధ్యాయులకు సూచనలు ఇస్తున్న ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు

చిలుకూరు : 2025– 26 విద్యా సంవత్సరంలో గురుకుల పాఠశాలలో ఐదవ తరగతిలో ప్రవేశానికి నిర్వహించే పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ దున్నా వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం స్థానిక పాఠశాలలో ఇన్విజిలేటర్లకు పరీక్ష నిర్వహణపై పలు సూచనలు ఇచ్చి మాట్లాడారు. పరీక్షకు 500 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు తెలిపారు. ఉదయం11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష ఉంటుందన్నారు.

నడిగూడెం : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 2025– 26 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతి ప్రవేశ పరీక్షను ఆదివారం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ చింతలపాటి వాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు 520 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. విద్యార్థులు గంట ముందు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

విద్యార్థులందరూ హాజరు కావాలి

నడిగూడెం : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఆదివారం జరిగే ఐదవ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులందరూ హాజరు కావాలని నడిగూడెం గురుకుల పాఠశాల పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాణాల నాగరాజు కోరారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో వీరస్వామి, రవినాయక్ ఉన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ కలయిక



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

అనంతగిరి : మండలంలోని అమీనాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2013–14 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు శనివారం సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మల్లేపల్లి వెంకటేశ్వర్లు, మీసాల వెంకట్రావ్, వినయ్, మధు, సాయి, నవ్య, నందిని, విజయలక్ష్మి, మీన, వసంత, దివ్య, బంగారి, మోనిక, స్వప్న, వినిత తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్లు పంపిణీ

కోదాడ : అంతర్జాతీయ కవలల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం కోదాడలోని బాలికల పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు కోదాడ కవలల అసోసియేషన్ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో చలిగంటి రామారావు, కొల్లూరు శ్రీనివాస్, నోముల శరత్, చంద్రకాంత్, హమీద్, స్వామి సురేష్, గోపారపు మహేష్, చిలువేరు వేణు తదితరులు పాల్గొన్నారు.



కోదాడ : విద్యార్థులకు ప్యాడ్లు పంపిణీ చేస్తున్న కవలల అసోసియేషన్ సభ్యులు

పాఠశాల అభివృద్ధికి సహకరించాలి

చిలుకూరు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు ఆ పాఠశాల పూర్వ విద్యార్థి అంబటి శేఖర్ జ్ఞాపకార్థం అతని స్నేహితులు ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



చిలుకూరు : విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేస్తున్న పూర్వ విద్యార్థులు

పోలింగ్ కేంద్రం పరిశీలన



మునగాలలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ సూర్యనారాయణ

మునగాల : ఈనెల 27న జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా మునగాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని శనివారం కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ.. స్థానిక తహసీల్దార్ వి.ఆంజనేయులుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రంలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ఆర్ఐ ఎస్.రామారావు, సిబ్బంది ఉన్నారు.

మిర్చికి మద్దతు ధర కల్పించాలి

హుజూర్‌నగర్: పెట్టుబడులు పెరిగిన కారణంగా రైతులు నష్టపోకుండా మిర్చి పంటకు క్వింటాకు రూ.25 వేల మద్దతు ధర కల్పించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్, జిల్లా నాయకుడు యల్లావుల రాములు డిమాండ్ చేశారు. శనివారం ఆ సంఘం ఆధ్వర్యంలో హుజూర్‌నగర్‌లో ఆర్‌డీఓ శ్రీనివాసులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కెట్‌లో మిర్చి ధర క్వింటాకు రూ.10 వేల నుంచి రూ.12 వేలు మాత్రమే పలుకుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మిర్చి రైతుల్లో ఎక్కువ శాతం కౌలురైతులే ఉన్నారని, వారు అప్పులు తెచ్చి పంట పండించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మామిడి నరసయ్య, జక్కుల రమేష్, జడ వెంకన్న, ఎల్లావుల రమేష్, కుడి తొట్టిస్వామి బంటు శ్రీనివాస్ పాల్గొన్నారు

డబుల్ ఇళ్ల వద్ద నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

హుజూర్‌నగర్‌రూరల్ : అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్లు పూర్తి చేసి అర్హులైన పేదలకు పంచాలని సీపీఎం మండల కార్యదర్శి పోషణబోయిన హుస్సేన్ కోరారు. మండలంలోని సీతారాంపురంలో ఆరేళ్లుగా అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద శనివారం సీపీఎం నాయకులు, పేదలతో కలిసి ఆయన నిరసన తెలిపి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టిసారించి ఇళ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని, లేని పక్షంలో సీపీఎం తరుపున పోరాడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు తంగెళ్ల వెంకటచంద్ర, మండల కమిటీ సభ్యులు మాదూరి నర్సింహాచారి, గోపారాజు, వీరస్వామి, యదమ్మ, లక్ష్మమ్మ, మణెమ్మ, బుచ్చయ్య, కనకయ్య, చంద్రయ్య, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి రాకుండా చూడాలి

నేరేడుచర్ల : వేసవిలో నీటి ఎద్దడి రాకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయ నాయుడు కోరారు. శనివారం నేరేడుచేర్లలోని సీపీఐ కార్యాలయంలో పార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో బోర్లు, చేతి పంపులు, సింగిల్ ఫేస్ మోటార్లకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని అన్నారు. మున్సిపాలిటీలో నీటి వసతి సరిగా లేని ప్రాంతాల్లో ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేయాలన్నారు. సీపీఐ నాయకులు యల్లబోయిన సింహాద్రి, కత్తి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీను, వెంకట్ తదితరులు ఉన్నారు.

వరిపైర్లకు నీరందించాలి



నేలమర్రిలో బీటలు వారిన వరి పొలాన్ని పరిశీలిస్తున్న కృష్ణ

మునగాల : శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ పరిధిలో వరిపైర్లకు నీరందక ఎండిపోతున్నాయని బీఆర్‌ఎస్ మండల నాయకుడు ఉడుం కృష్ణ తెలిపారు. శనివారం మండలంలోని నేలమర్రి, వెంకట్రాంపురం, తాడువాయి గ్రామాల్లో బీటలు వారిన వరి పొలాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. మండలంలోని 10 గ్రామాల్లో బోర్లు, బావులు, చెరువులు, కుంటల కింద వరిపైర్లకు సాగునీరు అందడం లేదని, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉత్తిమాటలు కట్టిపెట్టి తక్షణమే సాగు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



తాళిబొట్టు చూపిస్తున్న అర్చకులు



కల్యాణ వేడుకకు హాజరైన భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని వేపలసింగారంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ 25వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, గణపతిపూజ, ధ్వజారోహణ, పంచామృతాలతో అభిషేకం, అష్టోత్తర సహస్ర నామార్చనలు గావించారు. అనంతరం నూతన పట్టు వస్త్రాలతో స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవాన్ని రసరమ్యంగా రక్తికట్టించారు. తదనంతరం విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనము, రక్షాభందనం, మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలతో కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి గరుడవాహనసేవ, గ్రామోత్సవం, పవళింపు సేవ, ఉత్సవ పరిసమాప్తి కార్యక్రమాలతో పాటు నీరాజన మంత్ర పుష్పాలతో మహా నివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన కనకదుర్గమ్మ జాతర

చిలుకూరు : మండలంలోని బేతవోలు గ్రామంలో గత రెండు రోజులుగా కొనసాగిన కనకదుర్గమ్మ జాతర ముగిసింది. శనివారం ఆలయంలో గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం నుంచి ప్రభలను ఇళ్లకు తీసుకెళ్లారు. సుమారుగా 100 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ జాతరలో ఈ ఏడాది సందడి కనిపించలేదు. గ్రామంలో పార్టీల నాయకులు మధ్య వర్గపోరుతో ఘర్షణలు జరుగుతున్నందున కోలాట ప్రదర్శనలకు, ఎడ్ల పందేలకు పోలీసులు అనుమతులు ఇవ్వలేదు. దీంతో జాతర నిరాడంబరంగా జరుపుకోవాల్సి వచ్చిందని గ్రామస్తులు అంటున్నారు. నలభై ఏళ్ల క్రితం ఉదయం నుంచి సాయంత్రం వరకు రాళ్ల వర్షం కురవడంతో జాతర జరగలేదని, మళ్లీ ఇప్పుడు రాజకీయ నాయకుల మధ్య గొడవలతో పూజలు, మొక్కుల చెల్లింపునకే జాతర పరిమితమైందని చెబుతున్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

రేపాలలో తాగునీటి ఇక్కట్లు

మునగాల : మండలంలోని రేపాల మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో పక్షం రోజులుగా తాగునీటి సమస్యతో ప్రజలు అల్లాడుతున్నారు. అయినప్పటికీ అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పలుమార్లు కార్యదర్శి, మండలస్థాయి అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో గ్రామస్తులు కొందరు వ్యవసాయ బావులు, బోర్ల వద్దకు వెళ్లి ట్రాక్టర్లు, బైక్‌లు, సైకిళ్లపై డ్రమ్ములు, క్యాన్లలో తెచ్చుకుంటున్నారు. వేసవిలో తాగునీటి సమస్య మరింత జటిలమయ్యే అవకాశం ఉన్నందున యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. అయితే మోతె– మొద్దులచెరువు రోడ్డు డబుల్ లేన్‌గా మారుస్తుండడంతో పైపులు పగిలి తాగునీటి సమస్య తలెత్తిందని, శుక్రవారం పైపులైన్లకు మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించినట్లు గ్రామ కార్యదర్శి బ్రహ్మారెడ్డి తెలిపారు.



ట్రాక్టర్‌పై వ్యవసాయ బావినుంచి డ్రమ్ములో తాగునీరు తీసుకొస్తున్న రైతు

ఉమ్మడి కుటుంబ వ్యవస్థతోనే విలువలు

నేరేడుచర్ల : ఉమ్మడి కుటుంబ వ్యవస్థతోనే మంచి విలువలు అలవడుతాయని, ఆ వ్యవస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పినాకిల్ పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్‌కె మధార్ అన్నారు. శనివారం నేరేడుచర్లలోని పినాకిల్ పాఠశాలలో గ్రాండ్ పేరెంట్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాల యాజమాన్యం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక సీమంతం



గర్భిణులకు సీమంతం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

నడిగూడెం : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో గల ఒకటో అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం గర్భిణులను సామూహిక సీమంతాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు, స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కొండలమ్మ, స్వర్ణ కుమారి, సవిత, కవిత, శకుంతల, తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో వీడ్కోలు సమావేశం



సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని స్పందన జూనియర్ కళాశాలలో శనివారం విద్యార్థులు వీడ్కోలు సమావేశాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ యడవల్లి వెంకట్‌రెడ్డి మాట్లాడారు. మార్చి 5 నుంచి ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు ప్రణాళికబద్ధంగా చదివి మంచి మార్కులతో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కట్ట ప్రవీణ్‌రెడ్డి, అధ్యాపకులు సతీష్, శ్రీధర్, శ్రీనివాసాచారి, లింగారెడ్డి, శ్రీను, నగేష్, వెంకటేశ్వర్లు, బాలకృష్ణ, ప్రభాకర్, సైదిరెడ్డి, ఆంజనేయులు, నాగప్రసాద్ తదితరులు ఉన్నారు.

జిల్లా అధ్యక్షుడికి సన్మానం



వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న నాయకులు

కోదాడరూరల్ : ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన వెంపటి వెంకటేశ్వరరావును శనివారం కోదాడలో గరిడేపల్లి మండలానికి చెందిన ఆ సంఘం నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంఘంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి సంఘం అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పైడిమర్రి రఘునాథ్, ఓరుగంటి శ్రీనివాస్, రాము, నర్సింహారావు, హరి, గెల్లి సతీష్ ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

కుటుంబ విలువలు తెలియజేయాలి

హుజూర్‌నగర్ : విద్యార్థులకు చిన్నతనం నుంచే కుటుంబ విలువలు తెలియజేయాలని హెచ్‌ఎం పీవీ రమణారావు అన్నారు. శనివారం హుజూర్‌నగర్ పట్టణంలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో ఫ్యామిలీ బ్లూమ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు.. తల్లిదండ్రుల కాళ్లు కడిగి ఆశీర్వాదం తీసుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బీజేపీ అధ్యక్షురాలు శ్రీలతారెడ్డికి సత్కారం

గరిడేపల్లి : బీజేపీ జిల్లా అధ్యక్షురాలిగా నియమితులైన చల్లా శ్రీలతారెడ్డిని బీజేపీ గరిడేపల్లి మండల అధ్యక్షుడు కుక్కడపు వెంకటేశ్వర్లుగౌడ్ శనివారం సూర్యాపేటలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నర్సింగ్ అంజయ్య, చిత్తలూరి సోమయ్య, శ్రీను, పోకల వెంకటేశ్వర్లు, మేకల వెంకటేశ్వర్లు, రామినేని కృష్ణయ్య, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాలు ఏర్పాటు చేయాలని వినతి

నడిగూడెం : మండలంలోని వేణుగోపాలపురంలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఆ గ్రామానికి చెందిన పలువురు యువకులు శనివారం ఎంపీడీఓ దాసరి సంజీవయ్యకు వినతి పత్రం అందజేశారు. గ్రామంలో గత ఐదు నెలలుగా వీధి దీపాలు వెలగడం లేదని, డ్రెయినేజీ వ్యవస్థ కూడా అధ్వానంగా మారిందని వినతి పత్రంలో పేర్కొన్నారు. రేఖ వంశీ, నోసిన సురేష్, రిసికేశ్, సిద్దూ, బోసు పాల్గొన్నారు.

తారు రోడ్డుగా మార్చాలి

నేరేడుచర్ల : మండలంలోని పత్తేపురం నుంచి పెంచికల్‌దిన్న వరకు మూడు కిలో మీటర్ల మేర దారిని తారు రోడ్డుగా మార్చాలని పెంచికల్‌దిన్న గ్రామ మాజీ సర్పంచ్ సుంకరి క్రాంతికుమార్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం నేరేడుచర్లలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత 20 ఏళ్ల క్రితం మెటల్ రోడ్డు నిర్మించారని, ప్రస్తుతం రోడ్డు గుంతలమయంగా మారి ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారిందని తెలిపారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పందించి తారు రోడ్డు మంజూరు చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కోదాడరూరల్ : పట్టణ పరిధిలోని కొమరబండలో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు నరికి వేయడం, ఫీడర్ మరమ్మతు పనుల కారణంగా ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కోదాడ రూరల్ విద్యుత్ ఏఈ సైదా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

పాలకవీడు మండలంలో..

పాలకవీడు : పాలకవీడు, అలింగాపురం గ్రామాల్లో గల 33 /11 కేవీ సబ్‌స్టేషన్లలో సాధారణ నిర్వహణ పనులు చేపడుతున్నందున ఆయా సబ్ స్టేషన్ల పరిధిలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఏఈ పందిరి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.